గెడ్డను కప్పి ఫెన్సింగ్

- కోట్లు విలువ చేసే భూమి అక్రమణకు స్కెచ్
- మధురవాడ వికలాంగుల కాలనీలో భూదందా
- పట్టించుకోని అధికారులు



ప్రభుత్వ స్థలంలో తొలగించి పక్కకి తోసేసిన చెట్లు



వికలాంగుల కాలనీ ఎదురుగా భారీ గెడ్డను డెబ్రిస్‌తో కప్పి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణదారుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. అందినంతా దోచుకుందామన్న రీతిలో ఉన్నారు. ఆక్రమణలో ఉన్న భూముల క్రమబద్ధీకరణ జీవోను అవకాశంగా మలచుకుని, కోట్ల రూపాయల విలువైన భూమిని హస్తగతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులు ఆజ్ఞ ఇస్తే గానీ ముందుకు వెళ్లలేని స్థితిలో ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నం.146లో సుమారు 500గజాల మేర భారీ గెడ్డ అక్రమణకు అక్రమార్కులు కొద్దిరోజులుగా ప్రయత్నిస్తున్నారు. రేయింబవళ్లు పనులు చేయిస్తూ ఆ గెడ్డను గృహ నిర్మాణ వ్యర్థాలు, మట్టి, కంకర వేసి కప్పించేస్తున్నారు. అంతటి ఆగకుండా ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసి మరీ జిరాయితీ భూమిగా చూపించడానికి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రెండు ప్లాట్లుగా విభజించి, కూలీలను పెట్టి మరీ ఫెన్సింగ్ పనులు కానిచ్చేశారు. ఇక్కడ గజం ధర మార్కెట్ విలువ రూ. 50వేలు వరకు ఉండగా ఓపెన్ మార్కెట్‌లో ఇంకో 10వేలు వరకు ఎక్కువ పలుకుతోంది. అంటే దీని విలువ కోట్లలో ఉంది. మరో విచిత్రం ఏమిటంటే పక్కనే జిరాయితీ సర్వే నెంబరు. 294లో ఈ భూమిని చూపించి విలువైన గెడ్డ భూమిని కొట్టేయడానికి ఎత్తులు వేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఇప్పటికే చాలా ప్రాంతాల్లో గెడ్డలు కుదించుకుపోయి, వర్షం నీరు రోడ్లపై, ఇరుకు డ్రైనేజీల్లో నిలిచిపోతున్న పరిస్థితి. ఇక గెడ్డను పూర్తిగా పూడ్చేసి, ఫెన్సింగ్ వేసేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకుల ఉదాసీనత కారణంగా ప్రభుత్వ సిబ్బంది కూడా ఆక్రమణలపై చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్లు విలువ చేసే అత్యంత విలువైన భూములు మధురవాడ ప్రాంతంలో ఆక్రమణకు గురవుతున్నా పక్కనే ఉన్న ఆర్‌డీవో స్థాయి అధికారులు కూడా పట్టనట్టు వ్యవహరిస్తునాన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్‌లో లే బిట్ పేరుతో తోవ, గెడ్డ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఓ వృద్ధుడిని పెట్టి ఆక్రమించి నిర్మాణం చేస్తున్నా.. ఆచి తూచి స్పందించారు. ఇది ప్రభుత్వ భూమి అని తేల్చి కూడా.. చర్యలకు తాత్సారం చేస్తున్నారు.



గెడ్డలో నుంచి ఏర్పాటు చేసిన రోడ్డు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రస్తుతం వికలాంగుల కాలనీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు సచివాలయ గ్రేడ్–2 వీఆర్‌వో వంశీప్రశాంత్‌ చెప్పారు. తాము లేనప్పుడు పనులు చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ఆర్‌ఐ దృష్టికి తీసుకు వెళ్లగా ఆక్రమణ తొలగిస్తామని చెప్పినట్టు తెలిపారు.

నేటి ‘అన్నదాత పోరు’ను జయప్రదం చేయండి

- వైఎస్సార్‌సీపీ పిలుపు

తగరపువలస: రైతులకు కూటమి ప్రభుత్వం సకాలంలో యూరియా అందించకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్‌ సీపీ చేపడుతున్న ‘అన్నదాత పోరు’ ను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. నియోజకవర్గ రైతులకు మద్దతుగా వైఎస్సార్‌ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, భీమిలి ఆర్డీవోకు మంగళవారం వినతి పత్రం అందజేయనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు భీమిలి ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి వినతిపత్రం సమర్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షులు, జీవీఎంసీ వార్డుల అధ్యక్షులు కోరారు.

శివశక్తి నగర్‌లో ఆక్రమణ తొలగింపు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం శివశక్తినగర్ శ్మశాన వాటిక ఎదురుగా గల ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న భవనం పిల్లర్లను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఇక్కడ సుమారు 70 గజాల స్థలం ఆక్రమించి ఓ వ్యక్తి కొందరి సహాయంతో భవన నిర్మాణం చేస్తున్నాడు. స్థానికులు ఫిర్యాదు ఇవ్వడంతో, రెవెన్యూ అధికారులు దీనిని కూలగొట్టారు.

క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, చేపడుతున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. తహసీల్దార్ పాల్ కిరణ్ ఆదేశాల మేరకు ఈ నిర్మాణాలు తొలగించారు. ఎన్ని సార్లు హెచ్చరించినా ఈ కొండపై ఆక్రమణలు తగ్గడం లేదని, ఇకపై ఈ కొండపై సెంటు స్థలం ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఆరు తడి పద్ధతిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పద్మనాభం: సాగులో ఆరు తడి పద్ధతిపై ప్రకృతి వ్యవసాయం మోడల్ మండల టీమ్ లీడ్ గణేష్ కుమార్ పాండ్రంగిలో రైతులకు అవగాహన కల్పించారు. వాటర్ ట్యూబ్ పరికరాన్ని మడిలో ఎలా అమర్చాలి, పరికరం ఉపయోగం గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నారాయణమ్మ, మహంతి అప్పల రమణ పాల్గొన్నారు.


అక్షరాస్యత వల్లే సమాజ ప్రగతి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని అక్షరాస్యులు అవడం ద్వారా వారితో పాటు సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాహిత్య పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


తాగునీరు వృథా



వేములవలస నుంచి బంటుపల్లి కళ్లాల రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పంచాయతీలో కొద్దికాలంగా తాగునీరు వృథాగా పోతున్నా, గ్రామీణ నీటి సరఫరా విభాగం స్పందించడం లేదు. బంటుపల్లి కళ్లాల రోడ్డులోని భారీ వాహనాల రాకపోకల కారణంగా సీసీ రోడ్డు బద్దలై కింద నున్న పైపులైన్‌కు పగుళ్లు ఏర్పడి నిత్యం తాగునీరు వృథాగా పోతోంది. ఈ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి, తాగునీటి వృథాను అరికట్టాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.

అప్పన్న దర్శనాల పునరుద్ధరణ



దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు సోమవారం ఉదయం 8 గంటల నుంచి భక్తులకు కల్పించారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే కల్పించి ఆరోజు మధ్యాహ్నం 2.25 గంటలకు ఆలయ కవాటబంధనం చేసిన విషయం తెలిసిందే. తిరిగి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ, సుప్రభాతసేవ, హోమాలు, స్నపన తిరుమంజనం, బాలభోగం సేవలు నిర్వహించారు.

టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులే అధికం

- పీజీఆర్‌ఎస్‌లో సగం ఆ విభాగానివే..
- జోన్–2 పీజీఆర్‌ఎస్‌కు 24 అర్జీలు



రోడ్డు ఏర్పాటు, టీడీఆర్ సమస్యపై ఫిర్యాదు ఇస్తున్న నాయకులు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి అర్జీలే ఎక్కువగా ఉన్నాయి. భూ ఆక్రమణలతో పాటు, సమస్యలు పరిష్కారం చేయకుండానే అర్జీలు క్లోజ్ చేస్తున్నారంటూ ఫిర్యాదులు రావడం గమనార్హం. జోన్ పరిధిలోని వివిధ వార్డుల నుంచి మొత్తంగా 24 అర్జీలు రాగా టౌన్ ప్లానింగ్–12, ఈఈ వర్క్స్– 04, రెవెన్యూ–3, ఎలక్ట్రికల్–1, ప్రజారోగ్యం – 3, యూసీడీ విభాగానికి 1 చొప్పున అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి అర్జీలు స్వీకరించారు. రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలాలు కోల్పోయిన తమకు టీడీఆర్ కోసం ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వలేదని తక్షణ చర్యలు చేపట్టాలని బెవర బాపూజీ సహా మరో ఏడుగురు ఫిర్యాదు ఇచ్చారు. స్వయంకృషి నగర్ రోడ్డు సమస్యపై సీపీఎం నాయకులు, రుషికొండ సర్వే నెంబరు.14/1లో అనధికార దుకాణం తొలగించాలని అక్కరబోయిన రాంబాబు, రుషికొండ సర్వే నెం. 17,18, 19, 29, 332లో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. గత నెల ఆగస్ట్ 19న ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేశారని ఎల్. శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు ద్వారా తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ అర్జీదారులకు తెలిపారు.

ఆర్‌ఐల గైర్హాజరుపై ఆగ్రహం

రెవెన్యూ విభాగంలో ఇద్దరు ఆర్‌ఐలు తరచూ పీజీఆర్‌ఎస్‌కి హాజరు కాకపోవడంపై జెడ్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవన్నారు.

జోన్–1లో పది వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు పది వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఐదు, పట్టణ ప్రణాళిక విభాగానికి నాలుగు, రెవెన్యూ విభాగానికి ఒక వినతి వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



మెడల్, ప్రశంసాపత్రంతో తనూజ

భీమునిపట్నం: జాతీయ స్థాయి యోగా పోటీలకు భీమిలి సమీపంలోని సన్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తనూజ ఎంపికైంది. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో, 14 నుంచి 16 సంవత్సరాల వయసు విభాగంలో తనూజ మూడో స్థానంలో నిలిచింది. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో అక్టోబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుంది. ఆమెను స్కూల్ డైరెక్టర్ కై తపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న సతీష్

పీఎం పాలెం: సైబర్ సెక్యూరిటీపై కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలని సుప్రజ టెక్నాలజీస్ సీఈవో సీహెచ్ సతీష్ సూచించారు. బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ‘ది షీల్డ్ ప్రొటోకాల్ 25.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ’ పేరిట సోమవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. సైబర్ సెక్యూరిటీ ప్రధాన అంశంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మెరుగైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. వర్క్‌షాపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజన్ బాబు తదితరులు ప్రసంగించారు.

కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు

- గంధవరం గ్రామస్తులకు రాకపోకలకు అవస్థలు



కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు

పద్మనాభం: మండలంలోని అనంతవరం సమీపాన అలోపాలో గెడ్డ వద్ద నిర్మించిన తాత్కాలిక అప్రోచ్ రోడ్డు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో గంధవరం గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ గెడ్డపై గతంలో ఉండే కల్వర్టు తుఫాన్‌కు కొట్టుకుపోయింది. దీని స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. కల్వర్టు పూర్తయేంత వరకు గంధవరం గ్రామస్తులు పద్మనాభం రావడానికి కల్వర్టు పక్కన అప్రోచ్ రోడ్డు నిర్మించారు. ఇది పద్మనాభం రావడానికి దగ్గర మార్గం. కల్వర్టు ఇంకా పూర్తి కాలేదు. గోడలు కట్టి వదిలేశారు. ఈ నేపథ్యంలో వర్షానికి గెడ్డలో నుంచి అధికంగా నీరు రావడంతో అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోయింది. దీంతో గంధవరం గ్రామస్తులు పద్మనాభం రావడానికి ఇబ్బంది పడుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి కొత్త కొవ్వాడ, అనంతవరం రోడ్డు మీదుగా పద్మనాభం రావలసి వస్తోంది.

ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు

- ఎంపీపీ వాసురాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులు ప్రత్యేక శ్రద్ధతో చేపడుతున్నామని ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. సోమవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సర కాలంలో ఆయా పంచాయతీలకు మొత్తం రూ. 3.87 కోట్లు కేటాయించగా, అందులో రూ 2.80 కోట్ల వరకు పలు అభివృద్ధి పనులు జరిగాయని, మిగిలినవి కూడా త్వరలో చేపడతారని చెప్పారు. ప్రతీ పంచాయితీలో రూ.15 లక్షల వరకు పనులు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఆ మేరకు ప్రజాప్రతినిధులు అవసరమైన పనుల గురించి ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా మంచినీటికి సంబంధించిన అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ఎక్కడ ఎటువంటి అవసరాలు ఉన్నా వాటిపై వెంటనే పనులు నిర్వహించేలా చర్యలను తీసుకుంటున్నామని తెలియజేశారు. అధికారులు కూడా మంచినీటికి సంబంధించి ఎవరు తెలిపినా, వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు.

ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలి

వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు మాట్లాడుతూ అధికారులు చాలా పనులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురాకుండా నిర్వహిస్తున్నారని, ఇది ఏమాత్రం సరికాదని అన్నారు. పనులు చేపట్టినప్పుడు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే, వారు కూడా సూచనలు, సలహాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ ఇకపై చేపట్టే పనుల గురించి తప్పనిసరిగా ప్రజాప్రతినిధులకు తెలపాలని అధికారులకు సూచించారు.

- రెవెన్యూకు సంబంధించిన పనులు ఏమాత్రం సరిగ్గా జరగడం లేదని, అవి సక్రమంగా జరిగే విధంగా చూడాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల నివేదికల వివరాలను తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఎంపీడీవో నర్సింహరావు, అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతులు

భీమునిపట్నం: భీమిలి తీరంలో మత్స్యకారుల సదుపాయం కోసం గట్టును నిర్మించాలని భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సవరవిల్లి రామకృష్ణ, మత్స్యకారుల విభాగ చైర్మన్ పొట్టి రజనీకాంత్ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ గట్టు నిర్మిస్తే అందరికీ ఎంతో ఉపయోగంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

పింఛన్ కోసం అంధురాలు..



రజియాబేగం

మహారాణిపేట : తాను పుట్టుకతో అంధురాలినని, పింఛన్ ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో పీఎం పాలెం ప్రాంతానికి చెందిన రజియాబేగం వినతి పత్రం అందించారు. తనకు సదరం సర్టిఫికెట్ ఉందని, చాలాసార్లు దరఖాస్తు చేసినా పింఛన్ ఇవ్వడం లేదని పేర్కొంది. ఎన్నిసార్లు కోరినా కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని పంపేస్తున్నారని, తనకు వేరే ఆధారం లేదని వాపోయింది. పింఛన్ ఇస్తే తన కుటుంబాన్ని పోషించుకుంటానని విజ్ఞప్తి చేసింది.

భీమిలి బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తేవాలని..

తగరపువలస: 40 ఏళ్ల క్రితం భీమిలిలో నిర్మించిన ఆర్టీసీ బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ చిట్టివలస పరిరక్షణ సమితి అధ్యక్షుడు బల్లా వెంకటరావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. చారిత్రక ప్రాధాన్యం గల భీమిలి నుంచి తగరపువలస మీదుగా అప్పట్లోనే మాడుగుల, పోరాం, పాలకొండ, తుని, రాంబిల్లి, శ్రీకూర్మం, కోటగండ్రేడు, ఎస్.కోట, రాజాం తదితర ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి బస్సులు నడిచేవన్నారు. ప్రస్తుతం భోగాపురం ఎయిర్‌పోర్టు కూడా నిర్మాణంలో ఉన్నందున, ఈ ప్రాంత ఆవశ్యకతను గుర్తించి తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం కూడా చేపట్టాలని కోరారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మూత లేని మ్యాన్‌హోల్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఓ మ్యాన్ హోల్ మూతలేక ప్రమాదకరంగా ఉంది. మ్యాన్‌హోల్ ధ్వంసమై నెల రోజులు పైబడుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది రోడ్డుతో సమాన ఎత్తులో ఉండడంతో, చీకటిలో కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల నివారణకు స్థానికులు మ్యాన్‌హోల్‌పై కట్టెలు అడ్డంగా వేశారు, అయినప్పటికీ ముప్పు పొంచే ఉంది. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో పేరుకుపోతున్న పాలిథిన్ వ్యర్థాలు



చిల్లపేట-చిట్టివలస చెరువులో పాలిథిన్ వ్యర్థాలు



చెరువు గట్టు సమీపంలో ఇలా..

తగరపువలస: పాలిథిన్ వినియోగించే వ్యాపారులు, వినియోగదారులపై కఠినంగా వ్యవహరిస్తామన్న జీవీఎంసీ భీమిలి జోన్ అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. జోన్ పరిధిలో పాలిథిన్ నిషేధం ఉత్తి మాటగానే మిగిలిపోతోందనడానికి చిల్లపేట–చిట్టివలస చెరువే నిదర్శనం. వ్యాపారులు, హోటల్ యజమానులు, మార్కెట్లలో పాలిథిన్‌ను యథేచ్ఛగా వినియోగిస్తూనే ఉన్నారు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు ఆ వ్యర్థాలు చెరువులో గుట్టలుగా పేరుకుపోతోంది. పాలిథిన్ వినియోగంపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఫలితం ఉండదని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. హడావుడిగా రెండు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించడంతో సరిపెట్టకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

టీడీపీ నాయకుడి ఆక్రమణలపై ఆర్డీవోకు ఫిర్యాదు

- ఫిర్యాదుదారుడూ ఆ పార్టీ నాయకుడే..



ఆనందపురం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం సర్వే నంబర్ 237 మెట్ట బంజరులో సుమారు 120 గజాల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకుడొకరు ఆక్రమించగా, మరొక టీడీపీ నాయకుడు భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆనందపురం తహసీల్దార్ కార్యాలయంలో భీమిలి ఆర్డీవో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సూరిశెట్టి శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్ గ్రౌండ్ పరిశీలన

- నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతామన్న అధికారులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని ఎత్తు చేసి, నీరు నిల్వ లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వీరు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజతో కలిసి పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. కొద్దిరోజులుగా పాఠశాల మైదానాన్ని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. అయినా నీరు మాత్రం బయటకు వెళ్లకపోవడంతో పరిస్థితిలో మార్పు కనిపించలేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సీఎస్ దీవన్, సీఈ వరప్రసాద్, ఈఈ రమేష్, డీఈ నాగసత్యనారాయణ, ఏఈ శ్రావణి, జీవీఎంసీ ఈఈ శాంతిరాజు, ఏఈ శ్రీనివాస్‌లు పాఠశాల మైదానాన్ని సందర్శించారు. వర్షం నీరు బైటకి పంపించే విధంగా అన్ని చర్యలు చేపట్టి, సమస్యను పూర్తిగా పరిష్కారిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరావు, కమిటీ చైర్మన్ అచ్యుతరావు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



తిరుమల శ్రీదేవిని సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికై, అవార్డు అందుకున్న భీమిలి నెహ్రూ స్కూల్ ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవిని సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. స్థానిక హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో, కన్వీనర్ మైలిపల్లి షణ్ముఖరావు, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ, సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆమెను సన్మానించి, సేవలను కొనియాడారు.